క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో రాణిస్తారని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. సోమవారం మిషన్ శక్తి- జిల్లా హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్, సఖీ కేంద్రం సంయుక్తంగా ఉట్నూరులోని ఐటీఐ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, లింగ సమానత్వం, మిషన్ శక్తి పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ రొడ్డ శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజ్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: వికాసం పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేశ్ అన్నారు. సోమవారం ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అలాగే మ్యూజిక్ టీచర్‌ను నియమించాలన్నారు. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఐటీడీఏ తరఫున ఉపాధ్యాయులకు వికాసం పాఠశాల పక్కన తగిన భూమి ఉందని అదే ప్రాంతంలో నివాస గదులు ఏర్పాటు చేయాలన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా డుకురే దామోదర్, సుభాష్, భూమేశ్, రామారావు, వినాయక్‌రావు, నారాయణరెడ్డి, రవి, ప్రధాన కార్యదర్శిగా నానాజీ, శ్రీనివాస్, బాబ్జీ, కార్యదర్శులుగా సంతోష్, విద్యాసాగర్ రెడ్డి, తేజవర్ధన్, శ్రీనివాస్, అజయ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా సత్యప్రకాశ్, మహిళామోర్చా అధ్యక్షురాలిగా సుజాత, యువమోర్చా అధ్యక్షుడిగా భరత్, గిరిజన మోర్చా అధ్యక్షుడిగా కేశవ్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా ఖదీర్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా హిందీ దివస్


మాట్లాడుతున్న హిందీ లెక్చరర్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హిందీ లెక్చరర్లు హిందీ భాషా ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివకృష్ణ, లెక్చరర్లు లక్ష్మీ ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్: హిందీ భాషా ప్రాముఖ్యతను ప్రతీ విద్యార్థి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీక్ బేగం అన్నారు. జిల్లా కేంద్రంలోని కళాశాలలో సోమవారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. 1949 సంవత్సరంలో హిందీని జాతీయ భాషగా ప్రకటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, హిందీ లెక్చరర్ పూనం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు యాకుబలి, పృథ్వీరాజ్, రేఖ, చంద్రకాంత్, కునాల్, నరేశ్, శ్రీనివాస్, సమీర్ బోధన పాల్గొన్నారు.

పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలి


వినతిపత్రం అందిస్తున్న రైతులు

ఇంద్రవెల్లి: మండలంలోని మారుముల దొడంద గ్రామంలో సాగు చేస్తున్న పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని ఆదివాసీ మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుష్పరాణి డిమాండ్ చేశారు. సోమవారం దొడంద గ్రామ రైతులతో కలిసి ఐటీడీఏ పీవో కుష్బుగుప్తాకు వినతిపత్రం అందించారు. గత 20 సంవత్సరాల నుంచి ఆదివాసీ రైతులు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కుపత్రాలు లేవన్నారు. స్పందించిన పీవో సంబంధిత అధికారులతో మాట్లాడి పోడు భూములు హక్కుపత్రాలు ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆత్రం హనుమంత్‌రావ్, దేవ్‌రావ్, తుమ్ర ధన్ను, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

ఆదిలాబాద్: ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని దుర్గాపూజ సమితి ప్రతినిధి రఘు జోషి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీలో గల బొజ్జవార్ ఆలయంలో సోమవారం దుర్గాపూజ సమితి ఆధ్వర్యంలో వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేద పండితులు మేఘరాజ్ శర్మ పాల్గొన్నారు.

నరక ప్రయాణం..!


పొన్నారి వద్ద గుంతలు పడిన అంతర్రాష్ట్ర రహదారి

- గుంతలమయంగా అంతర్రాష్ట్ర రహదారి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

తాంసి: జిల్లా కేంద్రం నుంచి తాంసి, తలమడుగు మండలాల్లోని ఆయా గ్రామాల మీదుగా మహారాష్ట్ర వెళ్తున్న అంతర్రాష్ట్ర రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి రాంపూర్ మీదుగా తాంసి మండలంలోని పొన్నారి, వడ్డాడి, హస్నాపూర్‌తో పాటు తలమడుగు మండలంలోని ఖోడద్, ఉండం, సుంకిడి గ్రామాల మీదుగా 20 కిలోమీటర్లకు పైగా మహారాష్ట్ర సరిహద్దు వరకు అంతర్రాష్ట్ర రహదారి విస్తరించి ఉంది. పలుచోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గుంతలతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.

వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు..

ఈ రహదారి గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. లారీలు వేగంతో వెళ్లడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకున్న ఘటనలున్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణించే రోడ్డుపై గుంతలు పూడ్చి మరమ్మతులు పనులు చేపట్టకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి ఉంటుంది. వీటికి తోడు మూలమలుపుల వద్ద సైతం హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు దెబ్బతింది



అంతర్రాష్ట్ర రోడ్డు పూర్తిగా దెబ్బతింది. నిత్యం ఆటో నడుతూ.. జీవనం సాగిస్తాను. రోడ్డు దెబ్బతినడంతో ఆటో నడపడం కష్టంగా ఉంది. అలాగే ప్రమాదాలు కూడా జరుగున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– జై జివాన్, ఆటోడ్రైవర్

మరమ్మతులు చేపట్టాలి



రోడ్డుపై ఏర్పడిన గుంతలను అధికారులు పూడ్చాలి. గుంతల రోడ్డు ద్వారా ప్రయాణం చేయాలంటే ప్రమాదం జరుగుతుందని భయపడాల్సి వస్తోంది. గుంతలను తప్పించే క్రమంలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పుతున్నాయి.

– ప్రకాష్, వడ్డాడి గ్రామం

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు,. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బ్రహ్మానందం రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సుభాష్, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

భీంపూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డా.నిఖిల్ రాజ్ తెలిపారు. సోమవారం మండలంలోని జెల్కోరి, ఖైర్గూడ, అర్లి, అట్నంగూడ, కరణ్వాడి, వడూర్, కామాట్వాడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చరిత్, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, రూహిదాస్, మేఘ, సరస్వతి, లచ్చుబాయ్, సుజాత, విజయలక్ష్మి, భాగ్యవతి, జానాబాయ్, సంధ్యారాణి, మాయావతి పాల్గొన్నారు.

వాగుదాటి.. వైద్యం అందించి


వాగు దాటి వెళ్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పిప్పల్‌ధరి సబ్ సెంటర్ పరిధిలోని బుర్కి మారుమూల కొలాం గిరిజన గ్రామంలో సోమవారం అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది కాలినడకన వాగు దాటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు మార్గం లేకపోవడంతో వాగు దాటారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి సర్ఫరాజ్, సిబ్బంది ముయ్యాల మోతి, పవార్ ప్రేమ్‌సింగ్, తానుబాయి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి


అర్జీలు పరిశీలిస్తున్న అధికారులు

జైనథ్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రతీ మండల కేంద్రాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి భాస్కర్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక సంఘ భవనంలో ప్రజా వాణి నిర్వహించారు. ప్రజల నుంచి 64 దరఖాస్తులు రాగా.. వాటిని పరిశీలించి పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌కుమార్, తహసీల్దార్ ఆత్రం నారాయణ, అర్జీదారులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతంలోని సమస్యలు వెంటనే పరిష్కరించడానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు సమస్యలపై అర్జీలు రాగా.. ఇంద్రవెల్లి తహసీల్దార్ కార్యాలయంలోనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలు తెలుసుకొని పరిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

తలమడుగు: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఐటీడీఏ జీసీడీవో మెస్రం ఛాయాదేవి అన్నారు. సోమవారం మండలంలోని ఉమ్రీ ఆశ్రమ బాలికల పాఠశాల ఉమ్రి ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో సమావేశమై ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాల పరిసరాలు, వంటగది శుభ్రంగా ఉంచాలని వంట సామగ్రి, కూరగాయలు శుభ్రంగా కడిగి వంట చేయాలని సిబ్బదికి సూచించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణ, వార్డెన్ హిరమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతాంగ పోరాటాన్ని వక్రీకరించడం సరికాదు

ఆదిలాబాద్‌టౌన్: భూమి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ హిందూ, ముస్లిం పోరాటంగా వక్రీకరించడం సరికాదని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల వారోత్సవాలను నిర్వహించారు. సమావేశంలో స్వామి, గంగారాం, సక్కు, అడెల్లు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

తలమడుగు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నందిగామ, రేకులగూడెం, కోలాంగూడ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు అందించారు. ప్రధానోపాధ్యాయులు దివాకర్, చంద్రబాన్, ఉపాధ్యాయులు దివ్యశ్రీ, అశోక్, ప్రకాష్, వినోద్, కేదారీశ్వర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషి

బేల: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నిఖిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పృథ్వీరాజ్, మాడవార్ హరీశ్‌రెడ్డి, మనోజ్, అజయ్, శివ, జతిన్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: మీడియా ప్రతినిధులపై దాడులను అరికట్టడంతో పాటు అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు., సోమవారం జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీనివాస్, దత్తాత్రి, రమేశ్, సుభాష్, మహేందర్ రెడ్డి, రాజు, రఘునాథ్, రాజేశ్, మోయిజ్, రాజేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్వచ్ఛత ఏవం హరిత విద్యాలయంపై శిక్షణ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం స్వచ్ఛత ఏవం హరిత విద్యాలయంపై ప్రధాన ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంపై ఉపాధ్యాయులు పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. రిసోర్స్‌పర్సన్ శ్యాంకుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పాముకాటు

భీంపూర్: మండలంలోని అంతర్గావ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముకుంద్ పాముకాటుకు గురయ్యారు. సోమవారం తన వ్యవసాయ పొలంలో పనిచేసే సమయంలో పాము కాటు వేసింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇచ్చి, రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

నేడు జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: తలమడుగు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి అండర్ 14, 17 బాలికల ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆడే రామేశ్వర్ ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆధార్ కార్డు, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికెట్ ఎలిజిబులిటీ ఫామ్‌లను వెంట తీసుకురావాలన్నారు.

నేడు చైల్డ్‌రైట్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యురాలు రాక

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర చైల్డ్‌రైట్ ప్రొటెక్షన్ సభ్యురాలు ప్రమిళ అగర్వాల్ మంగళవారం జిల్లాకు రానున్నారని కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. నేరడిగొండ మండల కేంద్రంలోని కేజీబీవీని ఉదయం 11 గంటలకు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చోడ మండలంలోని అడెగామ(కె)లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఇచ్చోడ జెడ్పీఎస్ఎస్ పాఠశాలను సందర్శించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పీహెచ్‌సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, 3.15 గంటలకు ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను, 4.15 గంటలకు శిశుగృహను పరిశీలించిన అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నట్లు వివరించారు.

సెమినార్‌లో విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ హిందీ ఉన్నత పాఠశాలలో 'క్వాంటమ్ ఏజ్ బిగెన్స్ ఇట్స్ ప్రొటెన్షియల్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. పలువురు విద్యార్థులు సెమినార్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని లిటిల్‌స్టార్‌కు చెందిన రసికేతన్ ప్రథమ బహుమతి సాధించగా, లిటిల్‌ఫ్లవర్‌కు చెందిన సాయితేజస్వి ద్వితీయ బహుమతి, అరుణోదయ పాఠశాలకు చెందిన విద్యార్థి అర్వీ అగర్వాల్ తృతీయ బహుమతులను సాధించారు. కార్యక్రమంలో హిందీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లచ్చిరాం, జిల్లా సైన్స్ అధికారి ఆరె భాస్కర్, న్యాయ నిర్ణేతలు తిరుపతి, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

'విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే ఎన్ఈపీ'


నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్: విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు బీజేపీ నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలతో కలిసి ధర్నా చేపట్టారు. నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిలబడాలన్నారు. ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యా పేరుతో ఐదు సంవత్సరాల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, సురేందర్, మల్లికాంబ, మధునిక, పద్మ, అనసూయ, పార్వతి, మనీషా, కవిత, కళావతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె


సమ్మె చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఉట్నూర్‌రూరల్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, దినసరి ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు సోమవారం నాలుగోరోజుకు చేరాయి. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. జేఏసీ నాయకులు రాజన్న మాట్లాడుతూ.. క్యాటరింగ్ విధానం జీవో 527 రద్దు చేయాలని, నెలకు రూ. 15,600 వేతనం అమలు చేయాలని, పది నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాథోడ్ బాపురావు, రమేశ్, మానిక్‌రావు, రంజనాబాయి, రంభా, రాజు, రాంకిషన్ పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి


విద్యార్థులను అభినందిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని, వాటి పరిరక్షణ కృషి చేస్తూ ముందుకెళ్లాలని ఐటీడీఏ పీవో ఖుషూ గుప్తా అన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రత్యేక సంచికను సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. పీవో మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను బాహ్య ప్రపంచానికి తెలిసేలా ఆదివాసీలను చైతన్యం చేసేలా వ్యాసాలను ప్రత్యేక సంచిక రూపంలో తీసుకువచ్చిన టీఏజీఎస్ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో మడావి నాగోరావ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ

ఉట్నూర్‌రూరల్: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పోగులపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉట్నూర్‌లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటడం అభినందనీయమని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. క్రీడారంగా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో కొనసాగించాలన్నారు.

వసతులు కల్పించేందుకు కృషి


పరిశీలిస్తున్న మల్లెపూల నర్సయ్య

ఇచ్చోడ: పాఠకులకు గ్రంథాలయంలో వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని గ్రంథాలయ జిల్లా చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాల్లో పాఠకుల కోసం వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పుస్తకాలు, దినపత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, ముస్తాఫా, బత్తుల అశోక్, మహిబుబ్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: గ్రామీణ గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకొద్దామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించి, గ్రంథాలయ సేవలు, సమస్యలను లైబ్రేరియన్ నూర్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి స్థల కేటాయింపు, భవనం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని స్థానికులు కోరారు. స్పందించిన చైర్మన్ గ్రంథాయంలో వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు., సామాజిక కార్యకర్తలు బూర్లపల్లి గోవింద్, అంకుష్ లోఖండ్, కాంగ్రెస్ నాయకులు నాగ్‌నాథ్, ఆడే సునీల్ పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

బోథ్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని మండల కేంద్రంలోని వాగ్దేవి జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో చదువులు కొనసాగించలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విడుదల చేయాలని, లేకపోతే తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరడిగొండ: స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని సాయి చైతన్య డిగ్రీ కళాశాల ఎదుట లెక్చరర్లు, విద్యార్థులు నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజకిరణ్ రెడ్డి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉండడంతో కళాశాల నిర్వహణ భారంగా మారుతుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఉస్కెల కార్తీక్, వైస్ ప్రిన్సిపాల్ శరత్, లెక్చరర్లు ముకుందరావు, లింగన్న, రవి, శేఖర్, సాయిరామ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంల నిరసన


నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్‌సీడీ ఆన్‌లైన్ ప్రోగ్రాం విధుల నుంచి ఏఎన్‌ఎంలను తప్పించాలని తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంలతో కలిసి నిరసన చేపట్టారు. ఆన్‌లైన్ నమోదు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, స్వామి, ఏఎన్‌ఎంలు తులసీ, పుష్పల, రమ, శిరీష, రుకుంబాయి, సాయిమౌనిక పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై రాధిక

తలమడుగు: హైదరాబాద్‌లో ఈనెల 19, 20, 21 తేదీల్లో జరగనున్న ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ శిక్షణ తరగతులను ఫోటోగ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రాధిక అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, బబుల్, సాయి, అశోక్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని వినతి

బోథ్/ఇచ్చోడ/నేరడిగొండ/బేల/తలమడుగు: రాష్ట్రంలో పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా మండలాల్లో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో సామాజిక చేయూత పెన్షన్లు పెంచుతామని, కొత్తగా 12 లక్షల మందికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని విస్మరించిందన్నారు. వికలాంగులకు రూ. 6,000 పెన్షన్, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు కనీసం రూ. 4,000 పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడిచినా ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విశ్వకర్మ జయంతి

కైలాస్‌నగర్: విశ్వకర్మ జయంతిని ఈ నెల 17న అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల ప్రతినిధులు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేస్తే చర్యలు

ఉట్నూర్‌రూరల్: సోషల్ మీడియాలో అసత్యపు పోస్టులు, కామెంట్లు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని ఉట్నూర్ సీఐ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని పేర్కొన్నారు.